క్లుప్తంగా

అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలి



కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: దేశాన్ని అవినీతి నాశనం చేస్తుందని దీనిని అరికట్టకపోతే దేశ ప్రగతికే ప్రమాదమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మలజ్యోతి అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సర్ సీవీ రామన్ స్కూల్‌లో యూనియన్ బ్యాంక్, శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. స్కూల్ డైరెక్టర్ రమణం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి



ఆక్రమణలను తొలగించాలని అధికారులను డిమాండ్ చేస్తున్న వార్డు సభ్యుడు పెరుమాళ్ల రామకృష్ణ

ఆకివీడు: మందపాడులోని ప్రధాన రహదారి ఆక్రమణలకు గురైందని పంచాయతీ వార్డు సభ్యుడు పెరుమాళ్ల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మీ కోసంలో పలుసార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 50 లింకుల విస్తీర్ణంలో ఉన్న రహదారి 15 లింకులకు కుంచించుకుపోయిందని, దీనిపై సర్వే చేసి ఆక్రమణల్ని తొలగించాలని అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆక్రమణలతో పంచాయతీ రోడ్డు మార్జిన్‌లో కచ్చా డ్రెయిన్ కూడా తవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. వర్షం వస్తే రోడ్డు మునిగిపోతోందని, నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని రామకృష్ణ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్ స్పందించి, సచివాలయ సర్వేయర్‌తో కొలతలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: దుర్గాపురానికి చెందిన జి.మహేష్ అక్టోబర్ 10న పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకూ తిరిగి రాలేదని అతని భార్య మావుళ్లు ఫిర్యాదు చేసిందని టూటౌన్ పోలీసులు తెలిపారు. గతంలో ఇదే మాదిరి వెళ్లినా 10 రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని ఇప్పుడు ఎలాంటి ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్సై పి.నర్సింహస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నూతన ఆవిష్కరణలతో విద్యార్థుల వికాసం

భీమవరం అర్బన్: జాతీయ స్థాయిలో నూతన ఆవిష్కరణలు అధ్యయనం చేస్తే విద్యార్థుల విజ్ఞాన వికాసం మరింత పెరుగుతుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రజ్ఞ టెక్నికల్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయిలో నిర్వహించిన అనువుగా లేని ప్రదేశాల్లోనైనా నడపగలిగిన వాహనాలను డిజైన్ చేసి, రేసింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నడింపల్లి సూర్యభగవాన్ రాజు, కలిదిండి రామచంద్రరాజు, అప్పలరాజు, వేగేశ్న రమణరాజు, ఎస్‌వీ సోమరాజు, కె.నాగవర్మ, విద్యార్థి కమిటీ చైర్మన్ శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



శ్రీభీమేశ్వర స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): కార్తీక మాసం మొదటి సోమవారం భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. భీమవరం పంచారామ క్షేత్రంలో కొలువైన ఉమా సోమేశ్వరుడిని సోమవారం సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

శక్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో కొలువైన శక్తీశ్వరస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

వరి పైరుపై మూషిక దాడి

- సామూహిక నిర్మూలన కార్యక్రమంతో ఫలితం అంతంతమాత్రమే
- ఎకరాకు రెండు నుంచి నాలుగు బస్తాల దిగుబడి నష్టం
- బుట్టలో ఎలుక పడితే రూ. 50 నుంచి రూ.70 వసూలు



ఖరీఫ్ వరి పొలంలో దుబ్బులను ఎలుకలు కొరికిన దృశ్యం

ఆకివీడు: మూషికాన్ని చిన్న చూపు చూస్తే ఇట్లును, పంటలను గుల్ల చేయడంతోపాటు గాదెల్లో దూరి బస్తాల ధాన్యాన్ని నమిలేస్తుంది. చేలల్లో వరి దుబ్బులను కొరికి పంటను అస్తవ్యస్తం చేస్తుంది. దీంతో ధాన్యం దిగుబడి తగ్గి రైతులను నష్టానికి గురి చేస్తుంది. ఎలుకల నిర్మూలనకు ఎన్ని మందులు వాడినా నిరుపయోగంగానే ఉంటున్నాయి. ప్రభుత్వాలు ఏటా ఎలుకల మందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, ఒక్కో రైతు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎలుకల నిర్మూలన ఒక ప్రహసనంగా మారింది. ఏటా ఖరీఫ్, రబీ సాగు సమయంలో వరి పంట పిలకల దశలో, పొట్ట దశ, పాలు పోసుకునే దశలో మూషిక దాడి అధికంగా ఉంటుంది. వరి చేలల్లో మూషికాలు ఇష్టారాజ్యంగా తిరుగుతూ వరి దుబ్బుల్ని నాశనం చేస్తున్నాయి. దీంతో పిలకల సంఖ్య తగ్గి వరి కంకులు అంతంతమాత్రంగానే ఉండి దిగుబడి తగ్గుతోంది.

బుట్టలతోనే సత్ఫలితం

అశాస్త్రీయమైనప్పటికీ బుట్టలతోనే ఎక్కువ సంఖ్యలో ఎలుకల్ని రైతులు నిర్మూలిస్తున్నారు. ఎలుకల్ని పట్టుకునే వృత్తిలో కొందరు నైపుణ్యం సాధించి సత్ఫలితాలు సాధిస్తున్నారు. 50 ఏళ్లుగా తరతరాలుగా ఇదే వృత్తితో యానాది కులస్తులు జీవనోపాధి పొందుతున్నారు. వరి చేలల్లో ఎలుకల దారిని కనిపెట్టి దారిలోనూ, బొరియ వద్ద బుట్టలు అమర్చి వాటిని పట్టుకునేందుకు వారు ప్రయత్నం చేస్తుంటారు. బుట్టల వద్ద అల్లం, కొత్తిమీర, నువ్వుల పొడి, గుడ్డు, ఉల్లిపాయను మెత్తగా నూరి



వరి చేలల్లో పట్టిన ఎలుకలు

మేత ఎరగా వేస్తారు. ఈ వాసనకు ఎలుక బుట్ట వద్దకు వచ్చి తినే ప్రయత్నం చేస్తుంది. దీంతో బుట్టకు రబ్బరుతో అమర్చిన పంగలకర్ర వంటిది వెంటనే కదిలి ఎలుకను నొక్కివేస్తుంది. అతివేగంగా కలుసుకునే రెండు కర్రల మధ్య ఎలుక చిక్కుకుని వెంటనే చనిపోతుంది. ఎలుకలు పట్టుకునే వ్యక్తుల తయారుచేసే ఈ మిశ్రమ మందు ఘాటుగా, సువాసనతో ఉండటం వల్ల ఎలుక ఎక్కడున్నా బుట్ట దగ్గరకు ఇట్టే చేరుకుంటుంది. ఈ విధంగా ఎలుకల్ని అధిక సంఖ్యలో పట్టుకుని వారు జీవన భృతి పొందుతున్నారు. ఎలుక బుట్టలో చిక్కుకుని చనిపోతేనే రైతు డబ్బులిస్తాడు. ఒక్కొక్క ఎలుకకు రూ. 50 నుంచి రూ.70 వరకూ రైతులు చెల్లిస్తున్నారు. దూర ప్రాంతాలకు బుట్టలతో వాహనాలపై ఉదయం వెళ్లి సాయంత్రానికి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఎలుకలు పట్టుకునే యానాది కులస్తులు ఉండి నియోజకవర్గంలోని ఉండి ప్రాంతంలో అధికంగా ఉన్నారు.



బుట్టలో చిక్కి,చనిపోయిన ఎలుక

పని చేయని బ్రొమోడయాల్ మందు

వరి చేలల్లో సామూహికంగా ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బ్రొమోడయాల్ మందు అంతంత మాత్రంగానే పనిచేస్తోంది. వరి చేలల్లోని బొరియల్ని గుర్తించి, వాటిలో మందును వేసి బొరియలు పూడుస్తారు. బొరియల్లో ఎలుక ఉందో లేదో తెలియదు. మందును నూకలు, నూనె, బ్రొమోడయాల్ మందుతో కలిపి బొరియల్లో ఉంచుతారు. వీటిని తిని ఎలుకలు కొంతమేరకే చనిపోతున్నాయి. ఆ తరువాత గుట్టలుగా ఎలుకలు పుట్టుకు వచ్చి వరి పైరును నాశనం చేస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా వాటిని నిర్మూలించడం రైతుల తరం కావడం లేదు. నాణ్యమైన మందులు అందక రైతులు ఏటా ఇదే ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎలుకలను పట్టుకోవడంతోనే జీవనోపాధి



ఎలుకలు పట్టుకోవడం మా వృత్తి. మూడు తరాలుగా మా కుటుంబాల వారు ఎలుకుల్ని పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. సామూహిక ఎలుకల నిర్మూలనకు వాడే మందు అంతగా పనిచేయడం లేదు. ఒకటి రెండు ఎలుకలు మాత్రమే చనిపోతాయి. ప్రత్యేకంగా తయారు చేసే మందుతో ఎలుకల్ని బుట్టల సహాయంతో చంపుతాము. ప్రస్తుతం ఎలుకకు రూ.70 వసూలు చేస్తున్నాం. బుట్టలో ఎలుక చనిపోతేనే రైతు డబ్బులిస్తాడు. లేకుంటే మా శ్రమ, తయారు చేసిన మందు వృథా అవుతుంది.

– దుర్గారావు, ఉండి

పేదల ఇళ్లు కూల్చడం దారుణం

భీమవరం: ఆకివీడు-అయిభీమవరం రోడ్డులో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను అక్రమంగా కూల్చి వేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పేదల ప్రభుత్వమని గొప్పగా చెప్పుకుంటుంటే టీడీపీ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పేదల నివాసాలపైనే యుద్ధం చేయడం దారుణమన్నారు. ఖాళీ చేయడానికి కొంత సమయం ఇవ్వాలని పేదలు, బాధితులు ప్రాధేయ పడి వేడుకుంటున్నా కనికరించకపోవడం అన్యాయని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతోనే అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం, పేదలకు అండగా ఉన్న సీపీఎం నాయకులను అరెస్టులు, గృహ నిర్బంధాలు, బెదిరింపులు, హెచ్చరికలు దారుణమన్నారు. పేదలపై ఎమ్మెల్యే, ప్రభుత్వ దాడిని అందరూ ఖండించాలని, పేదలకు అండగా నిలవాలని బలరాం కోరారు. కూల్చిన ఇళ్లకు నష్టపరిహారంతోపాటు స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థిపై మందుబాబుల వీరంగం

భీమవరం: పట్టణంలోని ఒక కళాశాల వద్ద మందుబాబులు, విద్యార్థుల మధ్య వివాదం కొట్లాటకు దారి తీసింది. సోమవారం సాయంత్రం కళాశాల సమీపంలో ముగ్గురు మద్యం సేవించి మాట్లాడుకుంటున్నారు. వారికి సమీపంలో ఒక విద్యార్థి దీపావళి ఉల్లిబాంబు కాల్చడానికి ప్రయత్నించగా దూరంగా వెళ్లి కాల్చుకోవాలని సూచించారు. దీంతో ఆ విద్యార్థి మీ వద్ద మద్యం వాసన వస్తుంది మీరే దూరంగా వెళ్లమనడంతో కోపోద్రిక్తులైన మందుబాబులు విద్యార్థిపై దాడి చేశారు. వారిని వారించడానికి వెళ్లిన వ్యక్తుల పైనా పిడిగుద్దులు గుద్దారు. ప్రధాన రహదారి పక్కన జరిగిన సంఘటతో పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు భయబ్రాంతులకు గురై పరుగులు తీశారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-13 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ సోమవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బాయ్స్ విభాగంలో ప్రథమ స్థానంలో అనేపు శశాంక్ (తాడేపల్లిగూడెం), ద్వితీయ స్థానంలో నీలి కుశ్వంత్ (భీమవరం) విజేతలుగా నిలిచారన్నారు. గరల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో పెన్మెత్స సహస్ర (భీమవరం) ద్వితీయ స్థానంలో సాధనాల అంజలిప్రియ (భీమవరం) విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించామన్నారు. విజేతలు ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించే అండర్-13 రాష్ట్ర స్థాయి గరల్స్, ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని కిషోర్ తెలిపారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్, పెదపాటి రవి ప్రసాద్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం: పట్టణాల్లోని టిడ్కో ఇళ్లను తక్షణం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. భీమవరం మెంటేవారి తోట సుందరయ్య భవనంలో ఎం.వైకుంఠరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.లక్షలు అప్పు చేసి ప్రభుత్వానికి కట్టినా ఇంత వరకు పూర్తిగా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించకపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో డంపింగ్ యార్డ్ లేకపోవడం చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడం వలన దోమలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, డి.నాగు, కె.కృష్ణ, బి.వరలక్ష్మి, బి.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుందర్ సింగ్, ఎంపీడీఓ స్వాతి

కాళ్ల: ఉభయ గోదావరి జిల్లాల (తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి గ్రాడ్యుయేట్లు ఓటరు నమోదుకు నవంబర్ 6వ తేదీతో గడువు ముగుస్తుందని కాళ్ల తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారంలను తహసీల్దార్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు. డిగ్రీ పాసైన వారు 31 అక్టోబర్ 2021 ముందు పాస్ అయిన వారు దరఖాస్తును చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ పాసైన వారు ప్రొవిజనల్ సర్టిఫికెట్ నకలు (ఒరిజినల్ డాక్యుమెంట్, ఓడీ) అందుబాటులో ఉంటే దానితోపాటు స్థానికంగా నివాసం ఉంటున్న ఆధార్ కార్డు జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఓటర్ ఐడీ కార్డు, మొబైల్ నంబరు, జెరాక్స్ తీసిన కాపీల మీద గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న పట్టభద్రులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

పాలకోడేరు: అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదుకు ఈనెల 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ల నమోదు వేగవంతం

ఆకివీడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వేగవంతమవుతోందని ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. ఇప్పటి వరకూ ఆన్‌లైన్ ద్వారా 786 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 169 మంది తమ ఓటు హక్కును పొందారన్నారు. మొత్తం 955 మంది ఓటు నమోదు చేయించుకున్నారని చెప్పారు. మీ కోసంలో 5 ఫిర్యాదులు అందాయని ఎంపీడీఓ చెప్పారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం పంపామన్నారు.

కాళ్లకూరులో కార్తీక వనసమారాధన



కాళ్లకూరు శివాలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కార్తీక మాసంలో నిర్వహించే వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడానికి దోహదపడతాయని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు పేర్కొన్నారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న పార్వతి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. మరో మూడు సోమవారాలు దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డాల నాగరాజు, చేకూరి పుల్లంరాజు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ



ఉండి శివాలయంలో సహస్ర దీపాలంకరణలో చెన్నమల్లేశ్వరుడు

ఉండి: కార్తీకమాసంలోని మొదటి సోమవారం సందర్భంగా ఉండి శివాలయంలోని చెన్నమల్లేశ్వర స్వామిని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన జ్యోతిర్లింగార్చన, విశేష సహస్ర దీపార్చన, చెన్నమల్లేశుని విశేష పూజలు నిర్వహించారు. ఉండితో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయమంతా కోలాహలంగా మారింది. ఉదయం నుంచి భక్తులు తమతో పాటు ఒత్తులు తెచ్చి దీపాలు వెలిగించి సహస్ర దీపార్చన కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోతిర్లింగార్చన, కార్తీక పురాణం, శివపురాణం తదితర కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సన్నిధిరాజు చలపతిరావు, టీ కిరణ్, ఫణి శర్మ, ఎం సాయి, ప్రదీప్ పూజలు నిర్వహించారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ఘనంగా కార్తీక దీపోత్సవం



ఎస్ఆర్‌కేఆర్‌లో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం

భీమవరం: కార్తీక సోమవారం సందర్భంగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కార్తీక మాసం ప్రారంభంలో సంప్రదాయ సిద్ధంగా ప్రతీ ఏటా మొదటి సోమవారం విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించే కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు జ్యోతులు వెలిగించి కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువుతోపాటు సాంకేతికతను జోడించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని రంగాలలో టెక్నాలజీని జోడించి ఉత్తమ ఫలితాలను పొందేందుకు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి, నూతన సాంకేతిక పరికరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం స్థానిక వశిష్ఠ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు, జిల్లా అధికారులతో సమావేశమై వివిధ శాఖల్లో సాంకేతికతను జోడించి సులువైన మార్గాల ద్వారా ఉత్తమ ఫలితాలు పొందేందుకు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చదువు అంటే మూస పద్ధతిలో పరీక్షలకు మాత్రమే ఉపయోగపడేలా చదవడం కాదన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన తర్వాత ఏంటి అనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, చదువుతోపాటు సాంకేతికతను జోడించి వివిధ రకాలైన ప్రాజెక్టులపై దృష్టి సారించి ప్రయోగ ఫలితాల్లో విజయం సాధించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో అరుణశ్రీ, డీసీ హెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, పలు కళాశాలల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలలో విజేతలకు గణిత పుస్తకాలు బహూకరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు చిన్నతనం నుంచి గణితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులో డీఎన్నార్ ఉన్నత పాఠశాలలో సోమవారం హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవి జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు గణితం బోధించేటప్పుడు శ్రద్ధగా వినాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలకు గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు సౌజన్యంతో గణిత పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిరక్షణ అందరి బాధ్యత



ఉండి రైల్వే స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: మన చుట్టూ ఉండే పరిసరాలను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఉండి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండి రైల్వే స్టేషన్‌లో సోమవారం మొక్కలు నాటి, పారిశుద్ధ్య కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చగా ఉండేలా చూసుకుంటే రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని చిన్నచూపు చూడొద్దని ఎంత ఎక్కువగా సాధ్యమయితే అంత ఎక్కువగా అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మండల కార్యదర్శి ముదునూరి శివరామరాజు, కాగిత మహంకాళి, భూపతిరాజు హరనాథరాజు, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, స్టేషన్ సూపరింటెండెంట్ వీరకుమార్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి కూటమి కౌన్సిలర్ల గైర్హాజరు

ఆకివీడు : ఆకివీడులో సోమవారం నిర్వహించిన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశానికి కూటమి కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. గైర్హాజరైన వారిలో టీడీపీకి చెందిన నలుగురు, జనసేనకు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు సమాచారం ఇచ్చినప్పటికీ వారు గైర్హాజరు కావడంతో సమావేశానికి హాజరైన వారంతా అవాక్కయ్యారు. ఎమ్మెల్యేపై వ్యతిరేకతా లేక అభివృద్ధి నిధుల వినియోగంలో ఆయన జోక్యంపై ఆగ్రహమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అవసరమైన కోరం ఉండటంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, వైస్ చైర్మన్లు పుప్పాల పండు పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

భీమవరం: చినఅమిరానికి చెందిన బి.సుమలతను ఆమె భర్త రవికుమార్ కర్రతో తలపై కొట్టి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహం అయ్యిందని మద్యం సేవించి వచ్చి కొట్టినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఏఎస్సై ఎం.మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడక ఆరోగ్యానికి మేలు

తాడేపల్లిగూడెం: ఐక్యతా నడక ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఏపి నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి.వీరేష్‌కుమార్ అన్నారు. సోమవారం నిట్‌లో ఏర్పాటుచేసిన వాకథాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యమే సమజాభివృద్ధికి మూలమన్నారు. ప్రతీ విద్యార్థి పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం దేశాన్ని బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.